## వైద్యులు సమయ పాలన పాటించాలి

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



ఏరియా ఆస్పత్రిలో వైద్యులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, మే 18: ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యులు సమయపాలన పాటించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గం పారిశ్రామిక ప్రాంతం కావడంతో కార్మికులు, పేదలు, పరిసర ప్రాంత ప్రజలు వైద్యం కోసం ఏరియా ఆస్పత్రికి వస్తుంటారని, వైద్యులు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వైద్యులు సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తూ ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. అనంతరం ఆస్పత్రిలోని వార్డులను సందర్శించి రోగులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

### మిర్యాలగూడ అభివృద్ధికి కృషి

మిర్యాలగూడ పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రధాన డ్రైనేజీలో పేరుకు పోయిన చెత్తను ఆయన పరిశీలించి మాట్లాడారు. మిర్యాలగూడ మున్సిపాలిటీ అభివృద్ధిలో వెనుకబడి ఉందని, త్వరలో వీటన్నింటికీ తగిన పరిష్కారం చేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

## కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే వేముల వీరేశం



అంబేద్కర్‌నగర్‌లో కార్మికుల జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

కట్టంగూర్, మే 18 : సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వ కృషి చేస్తున్నదని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఆదివారం కట్టంగూర్ పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ -327 ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే ఉత్సవాల్లో పాల్గొని జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖలో వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మాద యాదగిరి, నాయకులు చాయల శ్రీనివాస్, పెద్ది సుక్కయ్య, ఐతగోని నర్సింహ, ఝాన్సీ, మాద పద్మ, గోశిక అంజన్‌కుమార్, కార్మిక సంఘం నాయకులు సమ్మిరెడ్డి, గుగులోతు పాండు, సమ్మెటి వెంకన్న, రవికుమార్, గోశిక ఉమాపతి, కోనేటి శ్రీను, కార్మికులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ఉమ్మడి శ్రీనివాస్‌రెడ్డి

త్రిపురారం, మే 18: మండలంలోని నీలాయగూడెం గ్రామానికి చెందిన కంచి సత్తెమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. జీహెచ్‌ఎంసీ అల్వాల డిప్యూటీ కమిషనర్ ఉమ్మడి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం గ్రామానికి వెళ్లి సత్తెమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట వంగాల తిరుమలరెడ్డి, వేముల నాగయ్య, కుందనపల్లి సందీప్, గజ్జల లింగారెడ్డి, గున్రెడ్డి వెంకట్‌రెడ్డి, కుందనపల్లి లింగయ్య ఉన్నారు.

## కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు చెన్నాయిపాలెం విద్యార్థులు



కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు ఎంపికైన విద్యార్థులు దుర్గాప్రసాద్, సాత్విక్

త్రిపురారం, మే 18: మండలంలోని చెన్నాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వాంకడోత్ దుర్గాప్రసాద్, రమావత్ గౌతమ్ గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ కళాశాలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉమ్మడి సైదిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దమ్మపేట్ కొత్తగూడెం కళాశాలలో ఇంటర్‌తో పాటు నీట్, ఐఐటీ వంటి వాటికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అటువంటి కళాశాలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు సత్యనారాయణ, సైదయ్య, స్వామి, లక్ష్మి, దశరథనాయక్, శ్రీనివాస్, విజయలక్ష్మి, నరేందర్, ఝాన్సీ, లలిత అభినందించారు.

## జంకుతండాలో తాగునీటి సమస్యను పరిష్కరించాలి : సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ, మే 18: మండలంలోని వెంకటాద్రిపాలెం పరిధిలోని జంకుతండాలో ప్రజలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారని, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం జంకుతండాలో నిర్వహించిన పార్టీ గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకటాద్రిపాలెం ఇండస్ట్రియల్ ఏరియాలో మౌలిక వసతులు కల్పించక పోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తండా వాసులు ప్రతిరోజూ పట్టణానికి వెళ్లి కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారని, వారికి తాగునీటిని అందించక పోవడంతో నెలకు రూ.వెయ్యి వెచ్చించి నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నియోజకవర్గ అధ్యక్షురాలు దాసర్ల దుర్గమ్మ, నాయకులు రాంపంగు భిక్షం, స్వామి, కోటమ్మ, లీలమ్మ, సైదమ్మ, వెంకటయ్య, విజయ్, లక్ష్మమ్మ, మస్తాన్, సంధ్య, రజియాబేగం, పద్మ, తులసి, చింటూ, భిక్షమమ్మ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

FOR RENT
shutter with open land for rent, 380Sqyd, 1st lane, Raghavendra Colony, New Vision School back side, Nalgonda. Good for godowns Contact: **8008987068.** NLG

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-

Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం

పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.

| | | |
|---|---|---|
| నల్లగొండ: 9182777625, 9182777635 | | దేవరకొండ: 9182777635 |
| హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638 |
| మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | చౌటుప్పల్: 9182777638 |

# కరెంటు కోత..ఉక్కపోత

- నార్కట్‌పల్లి పట్టణంలో వేళాపాలాలేని విద్యుత్ కోతలు
- మరమ్మతుల పేరుతో గంటల కొద్దీ విద్యుత్ సరఫరా నిలిపివేత
- మండు వేసవిలో ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు



నార్కట్‌పల్లి సబ్‌స్టేషన్

నార్కట్‌పల్లి, మే 18 : ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రత 40 డిగ్రీలు దాటుతున్నది. దాంతో పాటు గాలిలో తేమశాతం తగ్గడంతో ఉక్కపోత మొదలైంది. దానికి తోడు పగటి పూటే గంటల కొద్దీ విద్యుత్ సరఫరా నిలిపి వేస్తుండడంతో నార్కట్‌పల్లి పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నార్కట్‌పల్లి మండల కేంద్రంలో అనధికార విద్యుత్ కోతలు అధికమవడంతో ప్రజలు అల్లాడుతున్నారు. రోజుకు ఐదు నుంచి పది సార్లు కరెంటు పోతుండడంతో ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఎండ వేడి అమాంతం పెరగడంతో ప్రజలు ఫ్యాన్లు, కూలర్ల ద్వారా ఉపశమనం పొందుతున్నారు. దానికి తోడు వేసవి సెలవులు కావడంతో పిల్లలు, ఎంప్లాయిస్ కూడా ఇండ్లల్లోనే ఉంటున్నారు. అయితే విద్యుత్ సిబ్బంది మరమ్మతుల పేరుతో ఉదయం వేళల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండడంతో పట్టణ ప్రజలు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లల ఇబ్బందులు చెప్పలేనివిగా ఉన్నాయి. అయితే విద్యుత్ అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విద్యుత్ సరఫరా నిలిపివేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం మరమ్మతుల పేరుతో కరెంటు కోత విధించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మండు వేసవిలోనూ నిరంతరం విద్యుత్ అందించారని, ప్రస్తుతం వేళాపాలా లేకుండా కోతలు విధిస్తున్నారని స్థానికులు మండి పడుతున్నారు.

### గాలొస్తే కరెంట్ కట్

ప్రస్తుతం అకాల వర్షాలు కురుస్తున్న సమయంలోనూ విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొద్దిపాటి గాలివీచినా సరే విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా సరే విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. కొన్నిసార్లు రాత్రంతా విద్యుత్ సరఫరా లేక చీకట్లోనే గడపాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ముందస్తు ప్రణాళికలు లేకపోవడం, వేసవిలో లోడ్‌కు తగిన విధంగా ఏర్పాట్లు చేయక పోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కనీసం వేసవిలోనైనా కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని పట్టణ ప్రజలు వేడుకుంటున్నారు.

### మరమ్మతులు చేపట్టినప్పుడే నిలిపేస్తున్నాం

**చంద్రశేఖర్‌రావు, ట్రాన్స్‌కో ఏఈ, నార్కట్‌పల్లి**

ఈదురు గాలులు వస్తే ఎక్కడైనా వైర్లు తెగిపోయినప్పుడు మరమ్మతుల కోసం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నాం. పట్టణ కేంద్రంలో కరెంటు వస్తూ, పోతూ ఉన్న సమస్య ఉంటే తమకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాల్సింది. చిన్న చిన్న మరమ్మతులు ఉన్నచోట విద్యుత్ నిలిపివేస్తున్నాం. సాధ్యమైనంత వరకు నిరంతరం విద్యుత్ అందించేందుకు ప్రయత్నిస్తున్నాం. పట్టణంలో పలు వార్డుల్లో విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగలడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. కొమ్మలను తొలగిస్తున్నాం. ముఖ్యంగా పట్టణంలో రోడ్డు వెడల్పు సమస్య ఉన్నందున అక్కడక్కడ విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతున్నది.

### సమాచారం ఇవ్వకుండానే విద్యుత్ నిలిపేస్తున్నారు



ముందస్తుగా సమాచారం ఇవ్వకుండా రోజుకు 5 నుంచి 10 సార్లు కరెంటు నిలిపేస్తున్నారు. ఇలా కరెంటు వచ్చి పోతుంటే ఇండ్లల్లో ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోతున్నాయి. ఎండా కాలం కరెంటు లేక ఇండ్లల్లో ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నం. కరెంట్ ఇలా పోతుందేందని విద్యుత్ సిబ్బందిని అడిగినా సమాధానం ఇవ్వకుండా దాటేస్తున్నారు. చాలా ఇబ్బందులు పడుతున్నాం.

\- దుబ్బాక శ్రీధర్, నార్కట్‌పల్లి

### రాత్రివేళల్లోనూ కరెంటు పోతున్నది



నార్కట్‌పల్లి పట్టణంలో విద్యుత్ అంతరాయం లేని రోజంటూ లేదు. కరెంటు ఎప్పుడు పోతదో ఎప్పుడు వస్తదో తెలియదు. సాయంత్రం గాలిదుమారం వచ్చిందంటే రాత్రంతా కరెంటు ఉండడం లేదు. ఎండా కాలం కావడంతో రాత్రంతా జాగారం చేయాల్సి వస్తున్నది. పిల్లలు, వృద్ధులు మరీ ఇబ్బంది పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో అసలు కరెంటు కోతలే ఉండేవి కావు. ఉన్నతాధికారులు స్పందించి సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలి.

\- పుల్లెంల వెంకట్, నార్కట్‌పల్లి

## ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడి మృతికి సంతాపం

నీలగిరి, మే18 : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ ప్రతాపరెడ్డి మృతికి ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీహెచ్ పుల్లారావుతో పాటు పలువురు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు. సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని ఐఎంఏ భవన్‌లో ప్రతాపరెడ్డి సంతాప సభ నిర్వహిస్తున్నామని, డాక్టర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సంతాపం తెలిపిన వారిలో ఐఎంఏ మాజీ అధ్యక్షులు అనితారాణి, వసంతకుమారి, జయప్రకాశ్‌రెడ్డి నల్లగొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ దామెర యాదయ్య, డాక్టర్ ప్రవీణ్ ఉన్నారు.

## ఏఐవైఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా వెంకటేశ్వర్లు



తీర్పారి వెంకటేశ్వర్లు

మునుగోడు, మే18 : మునుగోడు మండలంలోని ఎలగలగూడెం గ్రామానికి చెందిన తీర్పారి వెంకటేశ్వర్లు ఏఐవైఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 15 నుంచి 18 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి పట్టణంలో జరిగిన సంఘం 17వ జాతీయ మహాసభలో జాతీయ కార్యావర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో తెలంగాణ నుంచి ఆరుగురికి అవకాశం కల్పించగా అందులో నల్లగొండ జిల్లా నుంచి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్న తీర్పారి వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు.

## సమ్మర్‌క్యాంప్ విద్యార్థులకు జర్కిన్లు అందజేత

మిర్యాలగూడ, మే 18: పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలోగల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌వీఆర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ ఉచిత వాలీబాల్ కోచింగ్‌ను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సందర్శించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించి గుర్తింపు తెచ్చుకోవాలని ఆయన సూచించారు. వాలీబాల్ కోచింగ్‌ను యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం విద్యార్థులకు ఎమ్మెల్యే జర్కిన్లు అందించారు. ఆయన వెంట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

చిట్యాల, మే 18 : మండలంలోని చిన్నకాపర్తి గ్రామానికి చెందిన చిట్టిపోలు ప్రశాంతికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. 60వేల చెక్కును ఆదివారం బోయపల్లి వెంకన్న అందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శిరసు ఇద్దయ్య, బోయపల్లి స్వామి, దేవరకొండ అనంతచారి, మాజీ ఉపసర్పంచులు రుద్రారపు శ్రీను, ఆవుల రమేశ్, మామిడి నాగేశ్ పాల్గొన్నారు



నీటితో కళకళ లాడుతున్న శాలిగౌరారం ప్రాజెక్ట్

## 14 అడుగులకు చేరిన శాలిగౌరారం ప్రాజెక్ట్

శాలిగౌరారం, మే 14: శాలిగౌరారం ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్ట్ నీటిమట్టం పెరుగుతున్నది. హైదరాబాద్‌తో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు రామన్నపేట మండలం పల్లివాడ హెడ్‌వర్క్ నుంచి సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు చేరుతున్నాయి. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 21అడుగులు కాగా ఆదివారం నాటికి 14 అడుగులకు చేరింది. దాంతో ఆయకట్టు రైతులు హర్శం వ్యక్తం చేస్తున్నారు.

## మహిళ ఆత్మహత్య

కోదాడ రూరల్, మే18: మానసిక, ఆర్థిక పరిస్థితి సరిగా లేక మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం మండలంలోని కూచిపూడి గ్రామంలో చోటు చేసుకుంది. కోదాడ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణానికి చెందిన పసుపులేటి నవ్య(22)కు కూచిపూడి గ్రామానికి చెందిన సాయిబాబాతో రెండేండ్ల క్రితం వివాహమైంది. ఆమెకు కూతురు ఉన్నది. నవ్య మానసిక పరిస్థితి, ఇంటి ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కూతురు గుక్కపెట్టి ఏడుస్తుండటంతో పక్కింటి వారు ఇంట్లోకి వెళ్లి చూడగా నవ్య ఆత్మహత్య చేసుకొని కనిపించింది. దాంతో వారు పోలీసులకు, ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతురాలి తల్లి వెంకటరమణ ఫిర్యాదు మేరకు


రూరల్ ఎస్ఐ ఎం.అనిల్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 'దిల్‌సుఖ్‌నగర్-చిట్యాల బస్సులను కొనసాగించాలి'

చిట్యాల,మే18 :దిల్‌సుఖ్‌నగర్ డిపో నుంచి చిట్యాల వరకు నడుపుతున్న ఆర్టీసీ బస్సులను నల్లగొండ డిపో అధికారులు అడ్డుకోవడం సరికాదని డీసీసీ ప్రధాన కార్యదర్శి పోకల దేవదాసు అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మూడు రోజులుగా దిల్‌సుక్‌నగర్ డిపోకు చెందిన సిటీ బస్సులు చిట్యాల వరకు నడుపుతున్నట్లు తెలిపారు. ఆదివారం నల్లగొండ డిపో అధికారులు సదరు బస్సులను చిట్యాల వద్ద నిలిపివేసి నల్లగొండ డిపో పరిధిలోకి రావద్దంటూ బస్సు డ్రైవర్, కండక్టర్లను ఇబ్బంది పెట్టినట్లు చెప్పారు. ఈ విషయాన్ని తాను ఎమ్మెల్యే వేముల వీరేశం దృష్టికి తీసుకెళ్లగా ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి బస్సులు యథావిధిగా కొనసాగేలా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. వివిధ పనుల నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లే చిట్యాల, పరిసర ప్రాంత ప్రజలు సమయానికి బస్సులు లేక రోడ్డుపై గంటల తరబడి వేచి చూస్తున్నారని తెలిపారు. వారి కోసం బస్సులను ఏర్పాటు చేయని నల్లగొండ ఆర్టీసీ అధికారులు హైదరాబాద్ నుంచి వచ్చే బస్సులను నిలిపివేయడం సరికాదని పేర్కొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

శాలిగౌరారం, మే18 : మండలంలోని గురజాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008-09 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు చదువు చెప్పిన గురువులను శాలువా, మెమొంటోతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కర్ణాకర్, నర్సిరెడ్డి, రామ్మోహనాచారి, యూసుఫ్ అలీ, ఖాజా, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



శాలిగౌరారం : సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

### నడికూడ జడ్పీహెచ్‌ఎస్‌లో..



గుర్రంపోడు : నడికూడ జడ్పీహెచ్‌ఎస్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

గుర్రంపోడు : మండలంలోని నడికూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2010 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గులాం మహ్మద్, రామలింగయ్య, శేఖర్‌రెడ్డి, షేక్ జలీల్, రవీంద్రచారి, శ్రీనివాసులు, ముదస్సిర్, సైదుద్దీన్, హఫీజా, ప్రశాంతి, పూర్వ విద్యార్థులు మారేపల్లి సైదులు, ఖాజాపాషా, శివ, కలకండ శ్రీకాంత్, సైదులు, నరేశ్, మహేశాచారి, జైశంకర్, నాగరాజు, సత్యనారాయణ, స్వప్న, ఉమాదేవి, షాహిన్, చందు, కోటేశ్వరి, కవిత, సంధ్య, సైదమ్మ, నాగమణి పాల్గొన్నారు.



ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

## దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

హాలియా, మే 18 : దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యాయాదవ్, స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. అనుముల మండలం చల్మారెడ్డిగూడెం గ్రామంలో నిర్మించిన సీతారామాంజనేయ శివ ఆలయ ప్రారంభోత్సవం, నూతన విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో వారు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందించారు. అనంతరం బీజేపీ రాష్ట్ర నాయకులు మన్నెం రంజిత్‌యాదవ్, బుసిరెడ్డి పాండురంగారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 5వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రావుల చినభిక్షం యాదవ్, మాజీ సర్పంచ్ రావుల శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపీటీసీ రావుల రాంబాబుయాదవ్, సీఐ అర్కపల్లి ఆంజనేయులు, వెంపటి సతీశ్, అల్లి పెద్దిరాజు, చేగొండి కృష్ణ, రావుల నరేశ్, నల్ల సాగర్, యడవల్లి దిలీప్‌రెడ్డి, నడ్డి లింగయ్యాయాదవ్, సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

## పలు కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి పరామర్శ



లక్ష్మమ్మను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్, మే 18 : నకిరేకల్ పట్టణానికి చెందిన బ్రహ్మదేవర రమేశ్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆదివారం వారి ఇంటికి వెళ్లి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం శనివారం దొంగల దాడిలో గాయపడిన పట్టణంలోని వీటీ కాలనీకి చెందిన నాగులవంచ లక్ష్మమ్మను చిరుమర్తి పరామర్శించారు. ఆయన వెంట కట్టంగూర్ మాజీ జడ్పీటీసీ తరాల బలరాం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, నాయకులు పెండెం సదానందం, సామ శ్రీనివాస్‌రెడ్డి, రాచకొండ శ్రవణ్, పెద్ది బాలనర్సింహ ఉన్నారు.

## ప్రశాంతంగా రేషన్ డీలర్ల అర్హత పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

మిర్యాలగూడ, మే 18: మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న 30 రేషన్ దుకాణాలకు డీలర్ల ఎంపిక కోసం ఆదివారం పట్టణంలోని కేఎన్ఎం డిగ్రీ కళాశాలలో రాత పరీక్ష నిర్వహించారు. 336 మంది దరఖాస్తు చేసుకోగా 305 మంది హాజరయ్యారు. 31 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ తనిఖీ చేశారు. పరీక్షను డీఏఓ శ్రీనివాస్‌శర్మ, తాసీల్దార్లు సంతోష్‌కిరణ్, సురేశ్, డీటీలు రజినీకాంత్, జావెద్, ఏఎస్ఐ భిక్షం పర్యవేక్షించారు.

## చిట్యాల వాసికి కీర్తిరత్న పురస్కారం



పురస్కారం అందుకుంటున్న తాడూరి చంద్రం

చిట్యాల, మే 18 : చిట్యాల పట్టణానికి చెందిన తాడూరి చంద్రం కీర్తిరత్న పురస్కారాన్ని అందుకున్నారు. చంద్రం సామాజిక సేవా రంగంలో చేస్తున్న సేవలకు గానూ పెద్దపల్లికి చెందిన గౌతమేశ్వర సాహితీ సేవా సంస్థ వారు పురస్కారానికి ఎంపిక చేశారు. ఆదివారం పెద్దపల్లిలోని జానకిరామ్ కల్యాణ వేదికలో జరిగిన కార్యక్రమంలో చంద్రాన్ని సన్మానించి అవార్డును అందించారు.

## ఖమ్మం సభను విజయవంతం చేయాలి


- ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్‌నాయక్



ఖమ్మం సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

మిర్యాలగూడ, మే 18: వచ్చే నెల 8న ఖమ్మంలో నిర్వహించే గిరిజన హక్కుల సాధనకై రాష్ట్ర స్థాయి ఉద్యమ కార్యాచరణ సభను విజయవంతం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్‌నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని తాళ్లగడ్డలో సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణనలో లంబాడీల జనాభాను ప్రకటించాలని, కేంద్ర ప్రభుత్వం గోర్‌బోలి భాషను అధికారికంగా గుర్తించి 8వ షెడ్యూల్‌లో చేర్చాలని, సేవాలాల్ మహారాజ్ జయంతి రోజున సాధారణ సెలవుదినంగా ప్రకటించాలని, గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూముల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సైదానాయక్, రాష్ట్ర నాయకులు పాండునాయక్, కృష్ణానాయక్, శిరసాల శ్రీనివాస్, దశరధ నాయక్ పాల్గొన్నారు.

## ఈతకు వెళ్లి యువకుడి మృతి



అర్జున్ (ఫైల్)

తిరుమలగిరి(సాగర్), మే 18: మండలంలోని పెద్దబావితండాకు చెందిన జటావత్ అర్జున్(19) ఆదివారం బావిలో ఈత కొట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. తండాకు చెందిన జటావత్ సక్రు, సరోజ దంపతుల కుమారుడైన అర్జున్ సాయంత్రం తన సోదరులతో కలిసి బావిలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈత కొట్టేందుకు బావి పై నుంచి నీటిలోకి దూకాడు. ఎంతకూ బయటకు రాకపోవడంతో అతడి సోదరులు స్థానికులకు సమాచారం అందించడంతో వారు బావి వద్దకు వచ్చి నీటిలో దూకి అర్జున్‌ను బయటికి తీయగా అప్పటికే మృతి చెందాడు.